# రెక్కలు తెగాయి

I. M. A. Souvenir

"కరిగిపోయిన కాలం తిరిగిరాదు
గతించిపోయిన స్మృతులు చిగురించవు"
ఇది అక్షర సత్యం
దీనిన్ని మనం జీర్ణించుకోక తప్పదు

—జయప్రద

దిగులు, దిగులు, దిగులు! ఈ దిగులుకు అంతం ఎక్కడ? అసలెందుకా దిగులు గుండెలనిండా ఈ బరువేంటి?

"అమ్మగార్షూ! ఏనయింది ఇంటికెళ్ళిపొమ్మంటారా?"

తలెత్తి చూసాను. ఇదివరకు రోజుల్లో కనురెప్పలెత్తితే కన్పించే రూపం ఇప్పుడు తలెత్తితే తప్ప కన్పించడంలేదు. కనురెప్పలమీద అంత బరువు—

ఆ పిల్లవంక చూసాను. పాతికేళ్ళుంటాయి. కాస్త లావుగా, బొద్దుగా, నిండుగా, చలాకీగా ఏ కోశానా దిగులనేది లేనట్టుగా వుంది. కనురెప్పలు మాత్రం వాల్చి నావైపు, నా అంగీకారంవైపు చూస్తోంది.

నాకో ఆలోచన వచ్చింది. నాకేనా ఈ అమ్మాయికి కూడా కను రెప్పలు బరువుగా వున్నాయా? నవ్వొచ్చింది. పాతుకేళ్ళ పిల్లకు యాభయ్ ఏళ్ళ నాకు ఏమి పోలిక?

"వెళ్ళు రేపు ప్రొద్దున్నే వచ్చెయ్యి"

"అట్టాగే నమ్మగోరూ!" గజ్జెల శబ్దం చేసుకుంటూ వెళ్ళిందా పిల్ల. అది నడక కాదు-పరుగు, ఆ కళ్ళల్లో సెలఏళ్ళు.

చప్పున పిలిచాను.

"రంగీ యిలా రా"

"ఏవమ్మా"

"ఏవీలేదు. ఏవీలేదు. వెళ్ళు లే అన్నట్టు మీ ఆయ నిప్పుడు నిన్ను బాగ చూస్తునాడటే."

"ఏం బాగో, తాగి తంతాడు. దిగులుకూడయిపోయింది రోజూ" సెలఏళ్ళలా కన్నీళ్ళు దుమికాయి.

దిగులుగా చూసాను. నేను దిగులుపడినంత సేపు పట్లేదు "ఈ రోజు నాగార్జున సినిమాకు తీసుకెళతానన్నాడు" ఈసారి ఆ పెదవుల మీద చిరునవ్వు కన్నీటిలో కాంతికిరణం!

ఆ వయస్సులో ఆ కాంతి తన కళ్ళల్లోనూ వుండేదా? రంగి వయస్సప్పుడు తనకు అమ్మ వుండేది. ఇప్పుడు అమ్మలేదు, నాన్న లేడు. తనని పసితనంలో లాలించిన ఇద్దరూ లేరు. అమ్ముంటే బాగుం డేది! అమ్మవున్నా ఈయన లాలించేదానికన్నా ఎక్కువేం లాలించేది? ఇంతకంటే ఏం పరిష్కారం చూపించేది! ఏమో! అయినా అమ్మ కావా లని కోరుకుంటోంది మనస్సు.

"అమ్మా! వెళ్ళనా?"

"ఇంకా వెళ్ళలేదటే వెళ్ళు వెళ్ళు."

రంగి వెళ్ళిపోయింది. మరలా శూన్యం. ఎవరయినా వస్తే బాగుణ్ను. ఈ ఏకాంతాన్ని భగ్నం చేస్తే బాగుణ్ను. ఎంత చిత్రం ఒకోక్కసారి ఏకాంతం కావాలని మనస్సు ఎంతగా కోరుకుంటుంది.

హటాత్తుగా నా ముఖం వికసించింది. నా మనసు కాదు శ్రీవారు వచ్చారు.

"ఏమిటి విష్ణూ అలా వున్నావేంటి"

"ఏమీలేదు"

"మనసు బాగాలేదా? సినిమా కెళదామా?"

"నాదేముందిలే కొద్దిగా వర్క్ వుందనుకో. రేపు చేసుకోవచ్చులే పదా వెళదాం"

"వద్దు, వెళ్ళాలని లేదు"

"మరి సినిమా కెళ్ళకుండా ఇక్కడేం చేయాలి ? పోనీ వెళితే ఉహూఁ వద్దు- కానీ ఇప్పటి నుండి ప్రొద్దుపోయి పడుకునేదాకా ఏం చేయాలి?" ఇంకా నా ఆలోచన తెగ్గనేలేదు.

"వంటేం చెయ్యమంటారమ్మా"

శ్రీవారు వెళ్ళిపోతున్నారు. ఆయన్ని ఆపాలని మనసు ఆరాట పడుతోంది. కానీ ఆపి ఏం చెప్పాలో తోచడంలేదు.

"ఎక్కడకు?"

"పిక్చర్ ప్రోగ్రాం లేదుకదా ఆడిటర్‌తో కొద్దిగా మాట్లాడాలి, వెళ్ళొస్తాను"

"ఒక్క క్షణం వుండండి."

"కూరేం చేయమంటారమ్మా" అక్కడే నిల్చొనివున్న వంటావిడ మరలా అడిగింది.

"ఏదో ఒకటి చేసేయ్ సుబ్బమ్మా"

"బంగాళాదుంపలకుర్మా చేసి సాంబారు పెట్టేదామ్మా"

"అలాగే ఏదో ఒకటి చేసెయ్యి. నన్ను విసిగించకు"

సుబ్బమ్మ లోపలికెళ్ళిపోయింది.

ఇప్పుడు నాకు ఆయనతోనే గడపాలనుంది. అందుకే ఆయన్ని ఆడిటర్ దగ్గర కెళ్ళకుండా ఆపాలనుంది, కానీ ఇంట్లో వుండాలనిలేదు. సినిమాకెళ్ళాలనీ లేదు. చిన్నప్పటిలా చెట్టాపట్టాలేసుకుని ఎక్కడికో ఎగిరిపోవాలనుంది.

ఆ ఎగిరిపోవాలి అనుకునే భావం వెనుక ఆవేశంలేదు. ఏదో నిరాశ.

ఆ నిరాశకు అర్థం వుంది. నా మనస్సుతో శరీరం సహకరించడం లేదు.

కాళ్ళు కదిపితే కీళ్ళ నొప్పులు! నేనేమి ఎగరగలను? ఎగిరిన మనస్సు రెక్కలు తెగి నేలమీద పడినా దిగులును మరింత చిక్క బర్చింది.

"సరే వెళ్ళండి!"

ఆయన నన్ను అర్థం చేసుకోలేదో! వదిలేస్తే చాలనుకున్నారో నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు.

మరలా నిశ్శబ్ద సంగీతం.

నా ఎదురుగా అన్నీ వున్నా ఏదో వెలితి— సంతోషం సేచురేట్ అవ్వాల్సిన సమయంలో దిగులు. చిక్కబడుతున్న దిగులు ఎందుకు? ఎందుకు?

ఇంట్లో ట్రాజెడీస్ లేవు, బాధలు లేవు, బాధ్యతలు లేవు, నిరాశలు లేవు, టెన్షన్ లేదు.

మరి....

మరి అయినా వెన్నెలను ఆస్వాదించలేకపోతున్నాననే దిగులు, దిగులుపడకూడని పరిస్థితుల్లో దిగులుపడుతున్నాననే దిగులు మరీ నన్ను కృంగదీసే సమయంలో బలవంతంగా సైక్రియాటిస్టు దగ్గర కెళ్ళాను.

ఆయన అంతా విని మందులు వ్రాసి ఇచ్చారు. ఆ మందులు పని చేస్తేనా ఇంకా ఎక్కువయింది.

ఇంక ఆయన దగ్గరకు వెళ్ళాలనిపించలేదు.

అఫ్‌కోర్స్ ఆయన చెప్పాడు- మందులు చాలా రోజులు వాడాలి అని.

మొదట్లో మందులు అలవాటయ్యేదాకా కాస్త జబ్బు ఎక్కువయినట్లే- వుంటుందనీ- కానీ ఏమిటో చెప్పడానికేం బాగనే చెపుతారు డాక్టర్లు.

–"నీ దిగులుకు కారణం చెప్పు ? బాగా ఆలోచిస్తే కారణం తప్పకుండా వుంటుంది" అని నన్ను రెచ్చగొట్టి తీరా నేను బాగా ఆలోచించి లీలగా తోచిన కారణం చెప్తే నవ్వేస్తాడా?

"నాకు పాతికేళ్ళ వెనక్కు వెళ్ళాలనుంది" అని అంటే- అందులో అతను నవ్వడానికేముందనీ!"

"నిజం పాతికేళ్ళ వెనక్కు వెళ్ళి- జీవిత భాగస్వామి కొరకు కలలు కనాలనుంది" మనసులో మాట చెపితే నవ్వుతాడా?

'ఇప్పుడు మీ శ్రీవారంటే అయిష్టమా ?' అని అడుగుతాడా పైగా.

మా ఆయనంటే నాకిందుకిష్టంవుండదు?

ఆలాటి బంగారుకొండ ఎవరికి దొరుకుతారు? కాకపోతే ఈయన కొరకే మరలా కలలు కనాలనుంది. కావాలనుకుంటే అందమం మామూలు రొటీన్ అయిపోయింది. కావాలనుకున్నా అందనంత తీయటి దూరంలో ఆతను-

ఓహ్! ఏమి అందమైన భావం!

"పోస్ట్...."

సుబ్బమ్మ వెళ్ళి అందుకుంది.

"అమ్మా! మీకు అబ్బాయిగారి దగ్గర నుండి వుత్తరం వచ్చింది"

"ఇలా పెట్టి వెళ్ళు"

"నిన్న ఒకటి వచ్చింది. ఈ రోజు ఇంకొకటి. పిచ్చిసన్నాసి అమ్మేమి బాధపడిపోతోందోనని చదువు మధ్యలో వీలు చూసుకుని మరీ రాస్తాడు హాస్టల్ నుండి"

చిన్నప్పుడు వాడెంత ముద్దుగా, బొద్దుగా చక్కగా ఎంత బాగుండేవాడసీ-- ఇప్పుడు అప్పుడే మీసాలు మొలిచి ఇంజనీరు అయి పోతున్నాడు.... తను పెద్దాదయిపోతూ అమ్మను ముసలిదాన్ని చేస్తూ- మరల దిగులు. "ఆ రోజులు తిరిగొస్తే ఎంత బాగుడ్ను, తొలిసారి మాతృమూర్తినయిన అనుభూతిలో ఎంతో స్పందన!"

దోమ కాటోలు వాలి మెడమీద కుట్టింది. ఆ కుట్టిన మెడ భాగాన్ని అద్దంలో చూసుకున్నాను కందిందేమోనని. నా గుండెల్లో దిగులు ఇంకా చిక్కబడింది. మెద నిండా ముడతలు. కళ్ళ క్రింద మచ్చలు పొట్ట ఎత్తుగా వుంది. చిన్నప్పుడు తన పొట్ట ఎక్కడో కనిపించకుండా వుండేది. వయస్సుతోపాటు అదీ పెరిగింది.

"అమ్మా! పాప ఫోటోలొచ్చాయి. డ్రయివర్ తెచ్చిచ్చి వెళ్ళాడు. మృదులమ్మా ఎంతందగా వుందో" సుబ్బమ్మ ఒక్కొక్క ఫోటో తను చూసి యజమానురాలికి అందిస్తోంది.

అవన్నీ మృదుల కాలేజీ యానివర్సరీ డేకి తీసుకున్న ఫోటోలు. ప్రతి ఫోటోలో, ప్రతి యాంగిల్‌లో మృదుల చాలా అందంగా వుంది. తనూ ఆ వయస్సులో ఇలాగే వుండేది. మృదుల ఫోటో శరీరం నునుపుగా ఉంది. ఎక్కడా ముడుత లేదు. ఎక్కడ ఫేట్ వుండాలో ఆక్కడ మాత్రమే వుంది. ఎక్కడ ఒంపులుండాలో అక్కడమాత్రమే ఉన్నాయి. కానీ ఇలా ఇంకెన్నాళ్ళు. చూస్తుండగానే కోరికలన్నీ వెనుక మిగిలి పోయుండగానే శరీరంలో మార్పులు మనల్ని బయ పెట్టడం, ఆ తర్వాత మృదులలో కూడా నిరాశ, నిస్పృహ.

ఏమిటో పిచ్చిగా ఆలోచిస్తోందిగానీ బాల్యం తర్వాత యవ్వనం, తర్వాత వృద్ధాప్యం తప్పవుగదా!

★ ★ ★ ★

"బిఘ్నా! బండ్లమ్మ దగ్గరకు ఒక్కసారి వెళ్ళిరాకూడదు! నీకు మనస్థిమితం కల్గుతుంది" నా స్నేహితురాలిచ్చిన సలహా నాకు క్రొత్తది. అందులో ఏదో ఒక ఆశ, మరలా ఆ ఆశ వెనుక నిరాశ.

"నాకు తగ్గుతుందంటావా?"

"తప్పకుండా! మొన్నీమధ్య మా వియ్యపురాలిలాగే వుండేది, అక్కడి కెళ్ళొచ్చాక ఇప్పుడు హాయిగా వుంది"

ఈసారి నాలో వెళ్ళాలా? వద్దా? అనే మీమాంస కలగలేదు.

ఒకే ఆలోచన వెళ్ళాలి. వెళ్ళి పైగా తన మనసులో వుండేదంతా ఆమె ముందు పర్చాలి.

ఆమె మ్యాజిక్‌చేతయినా నన్ను మారిస్తే ఆమెకు కోటిదండాలు. దొరకనిది అందుకోవాలనే ఈ దురాశ తాలూకు అశాంతిని ఇక భరించ లేదు.

★ ★ ★ ★

"అమ్మగారికి అనుగ్రహం కలిగింది. వారంలోజాల నిరీక్షణ తర వాత ఏకాంత మందిరానికి పిలుపొచ్చింది.

"బిడ్డా! ఏమి నీ కోరిక?"

తడబడింది తను.

తన కోరిక చెపితే నవ్వదూ! దేవత నవ్వుతుందా? వరాలిచ్చే దేవత నవ్వుతోందా తన్రభమగానీ-నవ్వదని నిర్ణయించుకొని నోరె త్తాను.

"నాకన్నీ వున్నాయి. నామాట కెదురులేదు. నన్ను ప్రేమించే మనుష్యులున్నారుగానీ నాలో నిరంతరం అశాంతి"

"కారణం తెలుసా?"

"తెలియదనే అనుకుంటున్నాను"

"నీకు తెలుసు చెప్పు. నోరు విప్పు"

"నా మనసు విచ్చుకొని ముందుకొస్తోందిగానీ నా నోరు విచ్చు కోవడంలేదు. అది అందరిముందు సంకోచించినట్టే సంకోచిస్తోంది"

"మనసు విప్పు బిడ్డా...."

"..........."

"నీ కోరిక నా ముందుంచు వరం ప్రసాదిస్తాను"

వరం ప్రసాదిస్తుందట! ఎంత ధీమాగా చెప్తోందామె! అంటే ఆమెలో ఆ శక్తి వుంది. అడిగేస్తాను. ఇదే తనకు దొరికిన ఆఖరుఛాన్స్. అడిగేయాలి.

మనసు కవాటాలు తెరుచుకొని నాభిలోనుండి గొంతులోకి, గొంతులోనుండి నాలుక చివరకు, అక్కడినుండి వెలుపలకు నా చిత్ర మయిన కోరిక ఎగిరి దూకింది.

నా కోరిక నాకే చిత్రంగా వుండగా ఆమె మాత్రం చలించ లేదు.

"బిడ్డా! నీ కోరిక తీరుతుంది"

ఆమె మరేమీ మాట్లాడలేదు. ఎదురుగా వున్న ఫలాలవంక చూసింది.

ఎదురుగా ఫలాలవంక చూసిందంటే తన కోరిక ఫలిస్తుందనా అర్ధం?

అసలది సంభవమా?

తమ పిచ్చిగానీ, అయినా తనలో ఆశ.

నిరాశగా బయలుదేరి వచ్చిన తనలో తిరిగి ఇంటికెళ్ళే ప్రయాణంలో ఏదో ఆశ.

ఇంకేదో ఆత్రుత.

* * * *

ఏమిటీ చిత్రం! బండ్లమ్మలో ఇంత అద్భుతశక్తి ఉందా?

ఇంత తక్కువ వ్యవధిలో నాలో ఇన్ని మార్పులా?

శరీరంలో ఎక్కడా ముడతలు లేవు.

అద్దంలో చూసుకుంటే ముఖంలో నునుపుదనం కళ్ళక్రింద నీలి నీడలు లేవు.

మెడంతా సిటారుగా ఏ ఒక్క ముడతా లేకుండా వుంది.

సరిగ్గా టీనేజ్ దాటే సమయంలో ఇలా వున్నాను నేను.

నా ఆశ్చర్యం అలవిగానిది.

నా అందాల్ని శ్రీవారికి చూపిద్దామని ఇంట్లోకి పరిగెట్టాను. ఇల్లు అంతా వెతికాను.

ఆయన లేరు.

నన్ను ఆశ్చర్యంలో, ఆనందంలో ముంచేస్తూ మూల గదిలో అమ్మ.

వెనక్కి తిరిగి చూసుకున్నాను నా ఇల్లేకానీ అమ్మ!

ఆనందంగా అమ్మ ఒళ్ళో పడుకున్నాను నా ఆనందం అలవి గానిది.

అమ్మ నావేపు వింతగా చూస్తోంది.

వెంటనే నా పిల్లలు గుర్తు వచ్చారు.

"అమ్మా! నా పిల్లలేరీ?"

"ఏ పిల్లలు విష్ణూ?" ఊడిపోయిన నా జడ అల్లుతూ అంది.

"పిల్లలేవిటమ్మా! పిల్లలే-మధు, అశ్విని, మృదుల ఏరీ?"

"పెళ్ళికాకుండా పిల్లలేవిటి? ఆ పేర్లేవిటి? కలగన్నావా? వెళ్ళేటప్పుడు నీకిష్టమని ఈరోజు గుత్తివంకాయకూర చేసాను. పొట్టచూడు- ఎక్కడో వుంది. ఎప్పుడో పొద్దున్ననగా రెండిడ్లీలు తిని వెళ్ళావు" అమ్మ అక్కడున్నుండి లేస్తూ అంది.

పిచ్చి పట్టినట్లయింది నాకు.

పొట్టవేపు చూసుకున్నాను.

అమ్మ అన్నట్లు ఎక్కడో వెన్నుకు అతుక్కుపోయింది.

నాకుండ పొట్ట అమ్మ చలవవల్ల ఎంత పల్చగా మారిపోయిందో

అమ్మ అన్నం పెట్టింది. కొసరికొసరి వడ్డించింది. ఇంకో ముద్ద తిను అంటూ బ్రతిమలాడి తినిపించింది.

అప్పుడు నా మనసులో ఏదో మార్పొచ్చింది.

అంతవరకు అయోమయంగా వున్న నా మనసు స్థిమితపడింది.

"నాన్నగారేరీ?"

"ఆఫీస్ కెళ్ళారు"

"ఓహ్! అవును-ఇది ఆఫీస్ టైమ్ కదా?"

"వెళ్ళి కాసేపు పడుకో! అన్నట్లు మర్చిపోయాను-రేపు నీకు పెళ్ళిచూపులు.

ఫాలమీద మీగడ కాస్త ముఖానికి రాసుకో, నునుపుగా ఉంటావ్ రేపటికి"

ఒళ్ళంతా ఏదో పాకింది. మనసంతా తీయటి అనుభూతితో నిండి పోయింది.

అతనెలా వుంటాడో?

ఓరకంట తననెలా చూస్తాడో?

అంతా కుదిరి పెళ్ళయితే ఈ క్షణంలో తనలో రేగిన భావాల్ని అతనికి చెప్పుకుని అతను తననా క్షణంలో ఎంత ప్రియంగా చూసుకుంటాడో చూడాలి.

తన ఆలోచనల్లో యీయన....

పెళ్ళిపీటల మధ్య నునుసిగ్గు దొంతరల్లో తను ఓరగా చూసింది

ఈయనెంతందంగా ఏ బాధ్యతలూ లేకుండా తనవేపే చూసుకుంటూ సిగ్గుపడే తన ముఖాన్ని ముద్దుగా చూసుకుంటూ-

ఈయన పెళ్ళికొడుకు దుస్తుల్లో నుదుట బాషికంతో రెండు చేతుల మధ్య తన మెడ-శిరస్సు-తన మెడలో ఆయన చేతులతో మూడు ముళ్ళు వేస్తుంటే వింత అనుభూతి!

దీవిక్కి దూరంకావడం ఇష్టంలేనట్లు మూడుముళ్ళు వేసాకకూడా నా మెడచుట్టూ అతని చేతులు-

ఆ చేతుల స్పర్శకు కొత్త అలజడి.

తలంబ్రాలు పోస్తున్న నన్ను స్నేహితురాళ్ళంతా ఉత్సాహ పరిచేస్తున్నారు.

"వాళ్ళకంటే మనం ఏమీ తీసిపోకూడదు విష్ణూ! విసురుగా మీ ఆయనమీద పోసెయ్"

తృప్తింత, పులకింత పరవశం ఆ ఆనందంలోనుండి హఠాత్తుగా ఏదో తెలిసినట్టయింది.

తన పెళ్ళయిన మూడవరోజేకదూ! అమ్మ చచ్చిపోయింది! ఏదో తట్టి లేపుతున్న జ్ఞాపకపు పుట.

"అమ్మమ్మా! ఎందుకరుస్తున్నావు? నాకు భయమేస్తోంది లే అమ్మమ్మా" చంటి నన్ను కుదిపి లేపుతోంది.

ఉలిక్కిపడి లేచి మంచంమీద కూర్చున్నాను.

చుట్టూ తల తిప్పాను.

ఎదురుగా టీపాయ్‌మీద ప్లవర్‌వాజ్‌లో ప్రొద్దున నేనమర్చిన పూలు అలాగే ఇంకా సడలిపోకుండా వున్న సత్యం-నన్ను ఈ లోకానికి తెచ్చింది.

తడవకు రెండుమెట్లు చొప్పున గెంతే ఉత్సాహం కొత్తదనపు సరదాల ఆ ఆనందపు ఝల్లులు తృప్తిపడే వయస్సు. తొందరచేసే యవ్వనం, వీటన్నిటి వెనకా ఏదో జ్ఞాపకం-ఆ పిల్లలు, పిల్లలు ఏరీ, ఏరీ వాళ్ళేరీ? అమ్మ చచ్చిపోతుంది.

ఆ సంగతి వాళ్ళకి చెప్పి తనివితీరా ఏడ్వాలి.

ఏదీ? మృదుల ఏదీ? హాస్టల్‌నుండి వచ్చిందా? పెద్దమ్మాయిని రమ్మనాలి మృదులను కూడా.

"మృదులా! మృదులా!"
"ఎవరు?" భర్త అడిగాడు.
"మృదుల మీకు తెలీదా?"
"ఊహూ"
"మన అమ్మాయి"
"మనమ్మాయా?" నవ్వాడతను.

"మనకు పెళ్ళయింది ఈరోజే"

మనసు పొరలమీద చిక్కటి అయోమయం-

గుండె అరల్లో పిల్లలు కనిపించాలనే ఆరాటం-మరలా అశాంతి.

వద్దు....వద్దు....ఈ పెళ్ళొద్దు-పెళ్ళయితే అమ్మ చచ్చిపోతుంది. ఈ పెళ్ళొద్దు. స్పృహ తప్పినట్టయింది.

కళ్ళుతెరచి చూసే మంచంమీదనుండి నేలమీద పడుకున్నాను.

తనభర్త తనకోసం పరిగెట్టలేదు.

సాయంత్రం బ్రెయిన్ హేమరేజ్‌తో చనిపోయే అమ్మ ఆతృతగా నా దగ్గరకొచ్చి నన్ను లేవదీయలేదు.

పగటికలా? హమ్మయ్య కలేకదా? చంటిని గట్టిగా కౌగలించుకున్నాను.

పాప ఉక్కిరి బిక్కిరయిపోయింది.

పాపకిది కొత్తగా వుంది.

పాపచేసే అల్లరి ఈమధ్యే భరించే శక్తిలేక తన యాతనలో ఆ పిల్లను విసుక్కోవడం అలవాటైపోయింది. చంటికి ఈ ప్రేమ కొత్తదిగా అనిపించింది.

అమ్మో! ఈ ప్రేమనుండి పారిపోవాలని ఎంత ఆశపడింది.

ఆ యవ్వనం ఎందుకు? చంటిది లేకపోయాక-ఎంత భయంకర మైన కల అది?

పెద్దమ్మాయి మృదుల, మధు వీళ్ళులేని జీవితం అది ఎంత సుందరమైందయినా సరే వద్దు-వద్దనే వద్దు.

"రా చంటీ! రా తల్లీ! నా చిట్టితల్లీ రా!" నా ప్రేమవాహినిలో చంటిది మునిగిపోతోంది.

చిత్రంగా ఇన్నిరోజులుగా నా గుండెలమీద పేరుకున్న బరువు దిగిపోయినట్టయింది.

మనసునిండా ప్రశాంతత-ఒకే ఒక కల-ఈ కలకు ఇంత మహా శ్యము వుందా?

రెక్కలు విప్పుకుని పరిగెట్టే మనసును ఆపేశక్తి ఈ చిన్నతల కుందా?

"ఏమిటిరా పడిపోయావట?" ఆత్రుతగా వస్తూ అడిగారు శ్రీవారు చంటి నన్ను విడిచి ఎప్పుడు వెళ్ళిందో తాతగారి చిటికెనవేలు పట్టుకొని బుడిబుడినడకలతో వస్తోంది.

శ్రీవారి పలకరింపుకు కాస్త సిగ్గుపడ్డాను. "ఏమీలేదు-కలొచ్చింది" అన్నాను.

"కలా! కలొస్తే" ఆయన నా ప్రక్కగా వచ్చి కూర్చున్నారు.

"చంటీ వెళ్ళి ఆడుకోమ్మా!" చంటిని పంపేసి నా గుండెల్లో గుప్తంగా వున్నదంతా ఆయనముందు పరిచాను ఈ రోజు కలతోసహా.

బహుశా ఆయన నాకు చాలా చెప్పాలనుకొనుంటారు. కానీ కొద్ది నిమిషాల నిశ్శబ్దం తర్వాత ఏదీ చెప్పకుండానే "పోనీలే ఇప్పుడు నీకు బావుందికదా!" అని సరిపెట్టారు.

నాకు తెలుసు నేనేమంటే ఏమి బాధపడతానోనని ఆగిపోయి వుంటారు. నేనుమాత్రం ఆగలేదు.

ఆయన మనసు తెలుసుకోవాలనుంది నాకు.

"నేను అలా ఆశపడి మనోవ్యాధి తెచ్చుకోవడం తప్పాకదండీ!"

"తప్పా?" ఆయనేం చెప్పాలో తెలియనివాడిలా కాసేపు తడుము కొని అన్నారు

"ఒక్కొక్కరి మనస్థత్వం ఒక్కోరకం. దానికి తప్పేమిటి? కాస్త భావుకత ఎక్కువ, అంతే"

నవ్వాను నేను.

హాయిగా నవ్వాను.

నిజం చెప్పనా? చిన్నతనంలో మీ ప్రక్కన కూర్చుంటే వెన్నెల చల్లగా, పిల్లతెమ్మెర హాయిగా, లలితసంగీతం లలితంగా, మీ స్పర్శ పదేపదే పరవశంగా-ఎన్నని చెప్పనులెండి....

ఇప్పుడలా నా మనసు స్పందించడంలేదా అని దిగులుపడేదాన్ని. అలా అని మీమీద ప్రేమ తగ్గిందని అనుకోకండి"

"ఛ, ఛ, ఆలా ఎందుకనుకుంటాను?"

"మీరనుకుంటారని కాదు. నాకే అనిపించేది- ప్రేమ తగ్గి ఇలా వుందా ఏమిటని?

తమాషా చెప్పనా? క్యాలండర్‌లో ఏసనర్ చూసినా మళ్ళీ అక్కడకు వెళ్ళి చూచోవాలనిపించేది." చెప్పడం ఆపి అయనవైపే చూసాను. ఆయన నా తొడమీద చెయ్యివేసి నా కళ్ళల్లోకి ప్రేమగా చూసారు.

"మాదేముంది విష్ణూ మెషిన్స్‌లాంటి వాళ్ళం–పెద్దమ్మాయికి పెళ్ళయిపోయింది. మృదుల కూడా పెళ్ళయితే బాధ్యతలు తీరిపోతాయని ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాంగానీ మీలాగ భాగస్వామికి మీ బావుకతలో కొండంత ఆనందాన్ని పంచిపెట్టగలమా?

ఆరోజే కాదు విష్ణూ ఈరోజుకూడా నీ దగ్గరనుండి నేను చాలా ప్రేమను అందుకుంటున్నాను."

"అంత ప్రేమా నాకు నీమీదున్నా ప్రకటించలేని బలహీనులం మేము.

నన్ను చేసుకుని నువ్వు చాలా దురదృష్టవంతురాలవయ్యావని నాకప్పుడప్పుడు బాధేస్తుంటుంది"

"అలా అనకండి' మీ మంచితనం నాకు తెలియందా? ఇంత మంచి భర్తకు భార్యనై అశాంతేమిటనే నా బాధ. మీదారే మంచిది. మీరు ఆలోచించేతీరే బావుంది.

ఈ వయసులో ఆలోచించాల్సింది పిల్లల పెళ్ళిళ్ళు, చదువులు గురించిగానీ,కానీ.... జరిగిపోయిన ముచ్చట్లు మరలా కావాలనుకోవడం తొలివయసు పీడిన, తొలి మాతృత్వపు మాధుర్యాన్ని మరలా పొందాలి అనుకోవడం-ఏవిటండీ ఇది నాకు జబ్బేనా?

"ఆ....పోతుంది విష్ణూ" అని నన్ను తేలికపర్చే ఉద్దేశంతో ఈ సారి నామీద జోక్ వేసారాయన.

"కలలో బండ్లమ్మ నిజంగా నిన్ను పసిదాన్ని చేసేసిందనుకున్నావా విష్ణూ!"

'ఆ' నేనూ నవ్వేసాను.

"అనుకోవడ మేమిటండీ! కలలో ఎంత భయపడ్డాననీ—నాతో పాటు పిల్లలు కూడా పసివాళ్ళయిపోతే పర్వాలేదు. వాళ్ళసలు ఫీల్డులోనే లేరు. ఎంత భయమేసిందనీ····బండ్లమ్మ కాళ్ళమీదపడి తనిచ్చిన వరాన్ని విత్‌డ్రా చేసుకోమని అడగాలనుకుంటేనూ...."

"పిచ్చి బండ్లమ్మా....వీళ్ళంతా మన బలహీనతల్ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారంటే ఇంకొన్నాళ్ళు సైక్రియాట్రిస్టు చెప్పిన ట్రీట్‌మెంట్ కన్టిన్యూచేస్తే నీకు పూర్తిగా నయమైపోతుంది.

అయినా నీ పిచ్చిగాని నీకు నేను, నాకు నువ్వు పసిపిల్లలంకాక మరేవిటే?"

"ఈసారి నిజంగా ఆయన చల్లటి ఒడిలో పసిపిల్లనైపోయాను"

❋